సాక్షి
జనగామ
గురువారం | 20 | జూలై | 2023



గోదావరికి పోటెత్తిన వరద

మహారాష్ట్ర నుంచి తరలివస్తున్న ప్రాణహిత నది వరదతో గోదావరి పోటెత్తింది. దీంతో గోదావరికి 9.500 మీటర్ల ఎత్తులో నీటి మట్టం పెరిగింది. - 8లో▸



వర్షంలోనూ కొనసాగిన సమ్మె

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు బుధవారం వర్షంలోనూ సమ్మె కొనసాగించారు. - 9లో▸

గరిష్టం/కనిష్టం
$29^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జల్లులు, ఓ మోస్తరు వర్షం కురుస్తుంది. ఈదురు గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయి.

న్యూస్‌రీల్

రైతులు పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలి

జనగామ రూరల్: అధిక లాభాలు ఇచ్చే పండ్ల తోటల పెంపకంపై రైతులు దృష్టి సారించాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. బుధవారం హార్టికల్చర్, వ్యవసాయ శాఖ అధికారులతో క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తోందని, స్థానిక స్థితిగతులను బట్టి మామిడి, సపోట, నిమ్మ, బత్తాయి, మునగ, అల్లనేరేడు, డ్రాగన్, సీతాఫలం తదితర 13 రకాల పండ్ల తోటల పెంపకానికి కృషి చేయాలన్నారు. ఈ మేరకు రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ రాంరెడ్డి, డీఏఓ వినోద్‌కుమార్, కేఆర్.లత తదితరులు పాల్గొన్నారు.

జనగామ ఆర్డీఓగా మురళీకృష్ణ బాధ్యతలు



జనగామ రూరల్: జనగామ ఆర్డీఓగా మురళీకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో రంగారెడ్డి జిల్లా తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించగా.. పదోన్నతిపై ఆర్డీఓగా ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, రోహిత్‌సింగ్‌లను కలిశారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

జనగామ రూరల్: జిల్లాలోని ఏడు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వివిధ సబ్జెక్టులు బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఇన్‌చార్జ్ డీఐఈఓ మంజుల ఒక ప్రకటనలో తెలిపారు. జనగామ బాలికల కళాశాలలో ఇంగ్లిష్, హిందీ, గణితం, ఒకేషనల్ కళాశాలలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, జీఎఫ్ సీ, ఒకేషనల్ కోఎడ్యుకేషనల్ కళాశాలలో తెలుగు, ఫిజిక్స్, ఉర్దూ మీడియంలో జువాలజీ, కామర్స్, స్టేషన్‌ఘన్‌పూర్‌లో తెలుగు, హిందీ, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకానమిక్స్, నర్మెట లో తెలుగు, ఫిజిక్స్, ఎకనామిక్స్, సివిక్స్, కామర్స్, దేవరుప్పులలో తెలుగు, కెమిస్ట్రీ, జువాలజీ, ఒకేషనల్‌లో ఎంఎల్‌టీ, ఏపీహెచ్‌డబ్ల్యూ, కొడకండ్లలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, కామర్స్, జఫర్‌గఢ్‌లో గణితం, బాటనీ విభాగంలో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ మెమోలు, కులం, ఆధార్, నివాస ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లతో కలెక్టరేట్‌లోని కార్యాలయంలో ఈనెల 24 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94903 62648 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

అన్ని వర్గాలతో మమేకం



జనగామ: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా డాక్టర్ సెల్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని.. ఈ సెల్ అన్ని వర్గాల ప్రజలతో మమేకం అవుతుందని కాంగ్రెస్ డాక్టర్ సెల్ నూతన కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర డాక్టర్ సెల్ సీనియర్ వైస్ చైర్మన్, వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ రాజమౌళి, జిల్లా చైర్మన్‌గా డాక్టర్ లక్ష్మీనారాయణనాయక్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం స్థానిక విజయ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, ఇతర అత్యవసర సమయాల్లో డాక్టర్ సెల్ ముందుంటుందని చెప్పారు. ఈ ఏడాది చివరిలో జరుగబోయే సాధారణ ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం అంకిత భావంతో పని చేస్తామన్నారు. నాయకులు మోర్తాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సర్టిఫికెట్లు

జనగామ రూరల్: అర్హులందరికీ త్వరలో సదరం సర్టిఫికెట్లు అందజేస్తామని డీపీఎం వినితరెడ్డి తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో బుధవారం నిర్వహించిన సదరం క్యాంపునకు 50 మంది వివిధ కేటగిరీల దివ్యాంగులు హాజరైనట్లు ఆమె చెప్పారు. క్యాంపులో ఆస్పత్రి సూపరింటెండెంట్ సుగుణాకర్‌రాజు, ఆర్థోపెడిక్ డాక్టర్ విశ్వనాథ్, వేణుగోపాల్, సమీర్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

సీటీ స్కాన్ ఏర్పాటు చేయాలి

జనగామ రూరల్: జిల్లా ఆస్పత్రిలో సీటీ స్కాన్, వెంటిలేటర్ ఏర్పాటు చేయాలని జిల్లా జాక్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం క్యాంపు కార్యాలయంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాక్ కన్వీనర్ మంగళంపల్లి రాజు మాట్లాడుతూ.. జిల్లా ఆస్పత్రిలో సీటీ స్కాన్ లేక రోగులు వరంగల్, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, అబ్బాస్, కౌశిక్, మహేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

తరిగొప్పుల: గ్రామంలోని 9వ వార్డులోకి పోటెత్తిన వరద నీరు



జనగామ: పట్టణంలోని కురుమవాడ ప్రధాన రహదారిపై వరద నీరు



జనగామ: బురదమయంగా మారిన జనగామ ఆర్టీసీ బస్టాండ్



ముసురుకుంది

వదలని వాన
- ప్రమాదకరంగా సోలీపూర్ రోడ్డు
- భారీ వర్షాలు కురిసే అవకాశం
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్‌రూం
- సమస్య తలెత్తితే(6303928718) కాల్ చేయండి



తరిగొప్పుల : కోతకు గురైన సోలీపూర్-పోతారం బీటీ రోడ్డు

జనగామ: జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న ముసురు, చల్లని వాతావరణంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రైతులు మాత్రం వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. అయితే సాధారణ వర్షమే కావడంతో చెరువులు, కుంటల్లో చేరేంత వరద రాలేదు. జిల్లాలో 797 చెరువులు, కుంటలు ఉండగా వాటిలో నాలుగింటిలోనే నూరుశాతం నీరు ఉంది. 376 చెరువుల్లో 25 శాతం నిల్వలు ఉండగా.. మూడు చెరువులు మత్తడి పోస్తున్నాయి. జనగామ పట్టణంలోని అనేక కాలనీలకు వరద ముప్పు పొంచి ఉంది. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ శివలింగయ్య ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రధాన రహదారులపై ఉన్న కల్వర్టులు, కుంటలపై దృష్టి సారించారు. ఇదిలా ఉండగా.. జనగామకు రెడ్ అలర్టు ప్రకటించిన నేపథ్యంలో భారీ వానలతో ప్రజలకు నష్టం కలుగకుండా ఆశీర్వదించాలని కోరుతూ పట్టణంలోని గుడ్లగడ్డ ఉమామహేశ్వర ఆలయంలో బుధవారం స్వామివారికి భక్తులు ప్రత్యేకంగా అన్నపూజ చేశారు.

సాగు అంచనాలు తలకిందులు..

జిల్లాలో వానాకాలం సీజన్‌లో 3.65లక్షల ఎకరాల్లో పంటల సాగుకు అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఆ మేరకు 1.90 లక్షల ఎకరాల్లో వరి, 1.60 లక్షల ఎకరాల్లో పత్తి, ఎనిమిది వేలు కందులు, ఇతర పంటలు 7వేల ఎకరాల్లో సాగవ్వాలి.. అయితే ఇప్పటి వరకు 25వేల ఎకరాల్లో వరి, 1.32 లక్షల ఎకరాల్లో పత్తి.. మొత్తంగా 1.70లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. వర్షాలు ఆలస్యంగా రావడంతో వరి సాగు అంచానాలను తలకిందులు చేసింది. మూడు రోజులుగా కురుస్తున్న వానలతో రైతులు వరి నాట్ల బిజీలో ఉన్నారు.

మండలాల వారీగా ఇదీ పరిస్థితి..

చిల్పూరు, రఘునాథపల్లి, దేవరుప్పుల మండలాల్లోని కృష్ణాజీగూడెం, ఇబ్రహీంపూర్, పడమటితండా, మల్యాతండాలో వరి నాట్లు ఊపందుకున్నాయి. మడికట్లలో వర్షం నీరు అధికమవడంతో దిగువకు మళ్లించేందుకు రైతులు ఒడ్డు కట్టలను తొలగిస్తున్నారు. తరిగొప్పుల 9వ వార్డులోకి వరద నీరు పోటెత్తడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సోలీపూర్-పోతారం బీటీరోడ్డు వరదకు కోతకు గురికాగా.. అంకుషాపూర్-బంజరపల్లి కలకుంట మత్తడి పోస్తోంది. జనగామ పట్టణంలోని బాలా జీ నగర్, కురుమవాడ, హైదరాబాద్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండుతో పాటు పలు కాలనీలు చిత్తడిగా మారాయి. కొన్ని చోట్ల వరద నీరు నిలిచింది. దీనికితోడు జీపీ కార్మికులు సమ్మెలో ఉండడంతో పల్లెలు, పట్టణంలో పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది.

మిషన్ భగీరథ హెచ్చరిక

ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రహదారులు, కాల్వలు జలమయంగా మారనున్నాయని మిషన్ భగీరథ ఈఈ శ్రీనివాస్ తెలిపారు. వరదలతో రోడ్లు కోతకు గురవుతాయని, పైపులైన్లు లీకేజీ అయి తాగు నీరు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. లీకేజీలు ఏర్పడితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. నీటి ట్యాంకుల్లో చిన్నచిన్న వానపాములు, తోక పురుగులు చేరుతాయని, పది రోజులకు ఒకసారి బ్లీచింగ్‌తో శుభ్రం చేయాలని సూచించారు.



దేవరుప్పుల: మల్యాతండాలో నాటు వేస్తున్న కూలీలు

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శివలింగయ్య ఆదేశించారు. ఆస్తి, ప్రాణ నష్టం, జరగకుండా ఉండేందుకు ఇప్పటికే క్షేత్రస్థాయిలో సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేసిన ట్లు చెప్పారు. ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఎలాంటి సమస్య తలెత్తినా 6303928718 నంబ ర్‌లో సంప్రదించాలని, 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు కంట్రోల్‌రూంకు నాలుగు కాల్స్ వచ్చాయని తెలిపారు.

జిల్లాలో వర్షపాతం వివరాలు

జిల్లాలో బుధవారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 40.3 మిల్లీమీటర్లు, రాత్రి 7 గంటల వరకు 42.4, రాత్రి 8 వరకు 44.3, రాత్రి 9.20 వరకు 44.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు సీపీఓ ఇస్మాయిల్ తెలిపారు. అత్యధికంగా జఫర్‌గఢ్‌లో 102, అత్యల్పంగా దేవరుప్పులలో 15.3 మి.మీటర్ల వర్షం కురిసిందని చెప్పారు.

వర్షపాతం వివరాలు(మిల్లీ మీటర్లలో)

మండలం	వర్షపాతం
జఫర్‌గఢ్	102.0
పాలకుర్తి	69.0
నర్మెట	29.5
తరిగొప్పుల	64.3
స్టేషన్‌ఘన్‌పూర్	63.3
బచ్చన్నపేట	45.5
రఘునాథపల్లి	46.3
చిల్పూరు	43.3
జనగామ	48.5
లింగాలఘణపురం	42.0
కొడకండ్ల	33.5
దేవరుప్పుల	15.3



కరెంటు విషయంలో అప్రమత్తంగా ఉండాలి

వర్షాల నేపథ్యంలో ప్రజలు కరెంటు విషయంలో అప్రమత్తంగా ఉండాలి. విద్యుత్ స్తంభాలు, తీగలను ఎట్టి పరిస్థితుల్లో తాకవద్దు. వ్యవసాయ మోటార్లు, స్టార్టర్లు తడిగా ఉన్న సమయంలో ముట్టుకోవద్దు. విద్యుత్ వైర్లు తెగిపడి, స్తంభాలు పక్కకు ఒరిగితే వెంటనే కింద ఉన్న ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలి.

- వేణుమాధవ్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ

మండల స్థాయి విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్లు

33/11కేవీ సబ్‌స్టేషన్లు	ఫోన్
జనగామరూరల్	9440811377
జనగామటౌన్-1	9440811376
జనగామటౌన్-2	9594842218
పెంబర్తి	9490614530
సింగరాజుపల్లి	7901678242
దేవరుప్పల	7901628352
నర్మెట	9440814113
తరిగొప్పల	7901678230
లింగాలఘణపురం	944811380
బచ్చన్నపేట	9440811387
రఘునాథపల్లి	9440811378
పడమటికేశ్వాపూర్	9491287532
ఖిలాషాపూర్	9491058648
స్టేషన్‌ఘన్‌పూర్	9440811381
జఫర్‌గఢ్	9440811386
చిల్పూరు	9440811382
కొడకండ్ల	9440814104
పాలకుర్తిటౌన్	9440811385
పాలకుర్తిరూరల్	8331017515
శివునిపల్లి	7901628352



జిల్లాలోని రిజర్వాయర్లలో నీటిమట్టం(మీటర్లలో)

రిజర్వాయర్లు	నీటిమట్టం	ప్రస్తుత లెవల్
గండిరామవరం	400	321
బొమ్మకూరు	198	99.500
చీటకోడూరు	300.258	166.706
నవాబుపేట	550.510	97.400
ఆర్ఎస్ ఘన్‌పూర్	1570	771
అశ్వారావుపల్లి	740	171
మైలారం బ్యాలెన్సింగ్	867	476

అర్థరహిత విమర్శలను తిప్పికొట్టాలి

- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

కొడకండ్ల: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ.. వ్యవసాయానికి దన్నుగా నిలిచిన రైతు పక్షపాతి సీఎం కేసీఆర్‌పై కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న అర్థరహిత విమర్శలను తిప్పికొట్టాలని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బుధవారం స్థానిక పద్మశాలీ మార్కండేయ భవనంలో సిందె రామోజీ అధ్యక్షతన నిర్వహించిన రైతు సమావేశంలో మంత్రి మాట్లాడారు. రైతుల పరిస్థితి.. 60 ఏళ్ల కాంగ్రెస్, టీడీపీ పాలనలో ఎలా ఉంది.. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో ఎలా ఉందో ప్రజలు విశ్లేషించుకోవాలని అన్నారు. తెలంగాణ వచ్చాక రెండేళ్లలో రూ.80 వేల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేసి లిఫ్ట్ ద్వారా పల్లెల్లో సాగు నీటితో జలకళ సంతరించుకుందని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణంలో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని రాహుల్‌గాంధీ, ఎకరాకు గంట చొప్పున మూడు గంటలు కరెంటిస్తే చాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. నలభై ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఇరవై ఏళ్లు కరెంట్‌పైనే పోరాటం చేశానని, ఇప్పుడు తెలంగాణలో అలాంటి పరిస్థితి చుద్దామన్నా కనిపించదని పేర్కొన్నారు. 'కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం.. ఇందులో ఎలాంటి సందేహం లేదు.. పార్టీ కోసం పనిచేసే వారందరినీ కాపాడుకుంటాను' అని మంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ జ్యోతి, ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, మార్కెట్ చైర్మన్ రాము, దేవస్థాన చైర్మన్ రామచంద్రయ్యశర్మ, సత్యనారాయణ, మధుసూదన్, విజయలక్ష్మి, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓర్వలేక అవాకులు చవాకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

జనగామ రూరల్: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కాంగ్రెస్, బీజేపీ నాయకులు అవాకులు చవాకులు మట్లాడుతున్నారని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. బుధవారం పెంబర్తి 8వ వార్డులో సీసీ రోడ్డు, శ్రీదుర్గామాత ఆలయం రేకుల షెడ్, బాత్‌రూంలు, వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కృషితో గ్రామాలు అభివృద్ధిలో పరుగులు పెడుతున్నాయని చెప్పారు. జనగామకు గోదావరి జలాలు తెచ్చి చెరువులను నింపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సర్పంచ్ అంబాల ఆంజనేయులు, ఎంపీటీసీ మూల రవి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, జెడ్పీటీసీ దీపికరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షురాలు బండ లక్ష్మి, రైతు కోఆర్డినేటర్ భూరెడ్డి ప్రమోద్‌రెడ్డి పాల్గొన్నారు.

దారిని పునరుద్ధరించండి



మున్సిపల్ చైర్ పర్సన్‌కు వినతిపత్రం ఇస్తున్న దుర్గాకాలనీ మహిళలు

జనగామ: కాలనీకి దారి లేకుండా చేశారు.. పిల్లలు.. ఉద్యోగులు.. మహిళలు గడప దాటి బయటకు రావడానికి వీలు లేకుండా పోతోంది.. మా బాధను అర్థం చేసుకుని దారిని పునరుద్ధరించాలని పట్టణంలోని సూర్యాపేటరోడ్డు దుర్గా కాలనీ వాసులు మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్యను కోరారు. ఈ మేరకు బుధవారం వినతిపత్రం అందజేశారు. 32 ఏళ్లుగా కాలనీలో ఉంటున్నామని, రాకపోకలు సాగించిన దారిని దేవాదాయ శాఖ అధికారులు ఇటీవల మూసి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా బతుకమ్మ, దసరా పండుగలు, బోనాల జాతరకు రెండు వీధులు రద్దీగా ఉంటాయని, అటువంటి ప్రాధాన్యత కలిగిన దారిని లేకుండా చేసే ప్రయత్నం జరుగుతోందని చెప్పారు.

తగ్గిన పేదరికం!


అయినా ఓరుగల్లులో కొనసాగుతున్న బహుముఖ పేదరికం
- మహబూబాబాద్, వరంగల్ రూరల్ జిల్లాల్లో అధికంగా పేదలు
- తక్కువ పేదలున్న జిల్లాల్లో పెద్దపల్లి తర్వాత వరంగల్ అర్బన్
- పరిశ్రమలు, చదువు, ఇతర వసతుల కల్పన
- జాతీయ బహుముఖ పేదరిక సూచికను వెల్లడించిన నీతి ఆయోగ్


(వరంగల్ డెస్క్)

ఓరుగల్లులో పదేళ్లలో పేదరికం తగ్గుముఖం పట్టింది. కొత్త పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగ, స్వయం ఉపాధితోపాటు అక్షరాస్యత పెరగడంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేదరికం తగ్గినట్లు నీతి ఆయోగ్ రూపొందించిన నేషనల్ మల్టీ డైమన్షియల్ పావర్టీ ఇండెక్స్ (జాతీయ బహుముఖ పేదరిక సూచిక)-2023లో పేర్కొంది. దేశంలో తెలంగాణ రాష్ట్రం.. అందులోనూ ఉమ్మడి ఓరుగల్లు జిల్లాలో పేదరికం.. బహుముఖ పేదరికస్థాయి గణాంకాలను వెల్లడించింది. 2015-16లో నిర్వహించిన నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-4తోపాటు 2019-21లో నిర్వహించిన 5వ సర్వే ఫలితాలను విశ్లేషిస్తూ ఈ నివేదికను రూపొందించారు.

మన జిల్లాల్లో పేదరికం తక్కువే..

నీతి ఆయోగ్ వెల్లడించిన జాతీయ బహుముఖ పేదరిక సూచికలో రాష్ట్రం 13.08 శాతం నుంచి 5.88 శాతానికి తగ్గింది. అదేవిధంగా కుమ్రంభీం ఆసిఫాబాద్, జోగుళాంబ గద్వాల, ఆదిలాబాద్, మహబూబాబాద్, నిజామాబాద్ జిల్లాల కంటే తక్కువ మంది పేదలున్న ప్రాంతంగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఉంది. అతి తక్కువ మంది పేదలున్న వాటిలో పెద్దపల్లి జిల్లా 2.17 శాతంతో మొదటి స్థానంలో ఉండగా, వరంగల్ అర్బన్ 2.41 శాతంతో రెండో స్థానంలో ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 38,20,369 మంది జనాభా ఉంది. ఇందులో 28,28,036 మంది పల్లెల్లో, 9,92,333 మంది పట్టణాల్లో జీవనం సాగిస్తున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య బహుముఖ పేదరికంలో అసమానతలు ఇప్పటికీ ఉన్నాయని నీతి ఆయోగ్ తన నివేదికలో పేర్కొంది.





12 అంశాలే ప్రామాణికం..

జాతీయ బహుముఖ పేదరిక సూచికను మూడు అంశాలను ప్రామాణికంగా తీసుకుని నిర్ణయించారు. వాటిలో దేశ ప్రజల ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణం. ఇందులో ఒక్కో అంశాన్ని మరింత లోతుగా పరిశీలించారు. **ఆరోగ్యంలో** : పోషకాహారం (ఆరేళ్లలోపు పిల్లలు, 15-49 ఏళ్ల మహిళలతోపాటు 15-54 ఏళ్ల పురుషులు), పిల్లలు, కౌమార మరణాలు, మానసిక ఆరోగ్యం. **విద్యలో**: పాఠశాలలకు హాజరు.. ఎన్నేళ్లు బడికి వెళ్లారు? వంటి అంశాలను చూశారు. **జీవన ప్రమాణం కింద**: వంటగ్యాస్, శుభ్రత, తాగునీరు, గృహ నిర్మాణం, విద్యుత్, ఆస్తులు, బ్యాంకు అకౌంట్‌ను పరిశీలించారు.

తక్కువ పేదరికం వరంగల్ అర్బన్‌లోనే..

వరంగల్ అర్బన్ పరిధిలో ఐటీ కంపెనీలతోపాటు పలు వస్త్ర పరిశ్రమలున్నాయి. అదేవిధంగా నగరంలో వివిధ వ్యాపార, వాణిజ్య రంగాల పరిధి కూడా రోజురోజుకూ పెరుగుతోంది. దీనికితోడు హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరం అన్ని రంగాల్లో ముందుకెళ్తోంది. దీంతో ఇక్కడ ఉపాధి అవకాశాలు అధికంగా ఉండడంతో పేదరికం స్థాయి తక్కువగా ఉన్నట్లు స్పష్టమవుతోంది.



- నీతి ఆయోగ్ తన నివేదికలో ములుగు జిల్లా గణాంకాలను వెల్లడించలేదు. దీంతోపాటు 2015-16లో నిర్వహించిన నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-4లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పేదరికం 12.12 శాతం ఉండి తక్కువ మంది పేదలున్న జిల్లాగా 32వ స్థానంలో నిలిచింది. కాగా.. బహుముఖ పేదరికం మాత్రం 0.049 శా తంగా ఉంది. కానీ, 2019-21 నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-5లో ఏ స్థాయిలో ఉందో వెల్లడించలేదు.

కేయూ పీహెచ్‌డీ ప్రవేశాల ఇంటర్వ్యూలు వాయిదా

● రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాసరావు

కేయూ క్యాంపస్ : తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రభుత్వం రెడ్ అలెర్ట్ ప్రకటించిన నేపథ్యంలో కాకతీయ విశ్వవిద్యాలయంలో ఈనెల 20వ (నేటి నుంచి) తేదీ నుంచి ప్రారంభం కానున్న వివిధ విభాగాల్లోని పీహెచ్‌డీ రెండో కేటగిరీ ప్రవేశాల ఇంటర్వ్యూలను నిరవధికంగా వాయిదా వేసినట్లు కేయూ రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాసరావు తెలిపారు. ఇంటర్వ్యూలను తిరిగి ఎప్పుడు నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ఈ మేరకు బుధవారం క్యాంపస్‌లోని పరిపాలనాభవనంలో వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన డీన్లు, విభాగాధిపతుల, పాఠ్య ప్రణాళిక అధ్యక్షులు, ఇతర అధికారులతో నిర్వహించిన అత్యవసర సమావేశంలో పీహెచ్‌డీ ప్రవేశాల ఇంటర్వ్యూలు వాయిదా వేస్తున్నట్లు ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నారని ఆయన తెలిపారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని, మరిన్ని వివరాలు విశ్వవిద్యాలయ వెబ్ సైట్‌లో చూడాలని శ్రీనివాసరావు వెల్లడించారు.

కార్మికుడి మృతదేహం లభ్యం

నెక్కొండ: కుంటలో స్నానానికి వెళ్లి నీట మునిగి గల్లంతైన కార్మికుడి మృతదేహం లభ్యమైంది. బిహార్‌కు చెందిన రామ్‌సోరణ్ ఈ నెల 17న స్థానిక చల్లా గోదాంల సమీపంలోని కుంటలో స్నానానికి వెళ్లాడు. నీట మునిగి గల్లంతు కాగా, కుంటలో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో బుధవారం ఉదయం కుంటలో రామ్‌సోరణ్ మృతదేహం తేలి ఉండడం చూసిన తోటి కార్మికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. దీనిపై మృతుడి సోదరుడు పప్పు సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించామని ఎస్సై జానీపాషా పేర్కొన్నారు.



పథకం వెల్.. పబ్లిసిటీ డల్

'కేసీఆర్ కా తోఫా ఖవాతీన్ కా భరోసా'కు ఆదరణ కరువు

● నేడు ముగియనున్న గడువు
● అర్హులకు అందేనా?
● గడువు పొడిగించాలి: మైనార్టీ సంఘాలు

న్యూశాయంపేట: నిరుపేద మైనార్టీ (వితంతువులు, ఒంటరి, విడాకులు తీసుకున్నవారు) మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం.. స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఇటీవల 'కేసీఆర్ కా తోఫా ఖవాతీన్ కా భరోసా'(కేసీఆర్ మహిళల కానుక) పేరుతో నూతన పథకం ప్రారంభించింది. ఈ పథకంలో భాగంగా నియోజకవర్గానికి వంద చొప్పున ఉచిత కుట్టుమిషన్లు అందించనుంది. మైనార్టీలు అధికంగా ఉన్న నియోజకవర్గాలకు అదనంగా మరో వంద మిషన్ల చొప్పున అందించనుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 నియోజకవర్గాలకు నియోజకవర్గానికి వంద చొప్పున 12 వందల మందికి కుట్టుమిషన్లు అందజేయనుంది. అలాగే, మైనార్టీలు అధికంగా ఉన్న వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు మరో వంద కుట్టుమిషన్లు పంపిణీ చేయనుంది.

దరఖాస్తులకు నేటితో గడువు పూర్తి..

పథకం ప్రారంభించిన అనంతరం అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. ఆ గడువు నేటితో(గురువారం) ముగియనుంది. అయితే పథకం బాగున్నా సరైనా ప్రచారం కల్పించడం లేదు. దీంతో పథక ఫలాలను అందుకోలేకపోతున్నామని నిరుపేద మైనార్టీ మహిళలు వాపోతున్నారు. దరఖాస్తులను స్థానిక ఎమ్మెల్యే ద్వారా అందజేయాలని మైనార్టీ కార్పొరేషన్ అధికారులు చెబుతున్నా.. తమకు ఎలాంటి సమాచారం లేదని స్థానిక ప్రజాప్రతినిధులు వెనక్కి పంపిస్తున్నారు. కాగా, దరఖాస్తు చేసుకోవడానికి ఆయా జిల్లాలోని మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయాల చుట్టు పేద మైనార్టీ మహిళలు ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం విధించిన గడువును వెంటనే పొడగించాలని మైనార్టీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



శిక్షణ పొందుతున్న మహిళలు(ఫైల్)

పథకానికి అర్హతలు...

ఈ పథకానికి అత్యంత నిరుపేద మైనార్టీ మహిళలు అర్హులు. (వితంతువులు, ఒంటరి, విడాకులు తీసుకున్న మహిళలు) 21 నుంచి 55 ఏళ్ల వయసు ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2లక్షల లోపు ఆదాయ ఉండాలి. ఆదాయ ధ్రువీకరణ పత్రం, తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు, 5వ తరగతి విద్యార్హత, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జతచేసి స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. గడువు సమీపిస్తుండడంతో రెండు రోజుల నుంచి ప్రజాప్రతినిధుల ఇళ్లకు వెళ్లిన మైనార్టీ మహిళలు అక్కడ పడిగాపులు కాస్తున్నారు. నిరుపేద మహిళల ద్వారా దరఖాస్తులు తీసుకున్న ప్రజాప్రతినిధులు వాటిని ఈనెల 21వ తేదీ వరకు కలెక్టర్లకు అందజేయాలి. కలెక్టర్ ఈ దరఖాస్తులను పరిశీలించి ఈనెల 27తేదీ వరకు స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు సమర్పించాల్సి ఉంది.

అయోమయంలో మహిళలు..

'కేసీఆర్ కా తోఫా ఖవాతీన్ కా భరోసా' పథకానికి సరైనా ప్రచారం కల్పించక పోవడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మైనార్టీ మహిళలు దరఖాస్తులు చేసుకోలేదని తెలుస్తోంది. ఈ పథకం స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా అమలు చేయాలని నిర్ణయించింది. ఎమ్మెల్యేల ద్వారా ఈనెల 20 వతేదీ వరకు దరఖాస్తులు స్వీకరించి వాటిని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారుల ద్వారా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు పంపాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే పథకం గురించి ప్రజాప్రతినిధులకే తెలియకపోవడంతో అర్హులు అయోమయానికి గురవుతున్నారు.

గడువు పెంచి, విస్తృత ప్రచారం చేయాలి



గడువు తేదీని పొడిగించాలి. పథకంపై విస్తృత ప్రచారం కల్పించాలి. దళితబంధు మాదిరి యూనిట్‌లను అందించాలి. యూనిట్ కాస్ట్‌లను పెంచి పేదమహిళలకు స్వయం ఉపాధి అందించాలి. ఉచిత కుట్టు మిషన్ పథకం యూనిట్‌లను నియోజకవర్గానికి ఐదువందల చొప్పున పొడిగించాలి.

రాజ్ మహ్మద్, అధ్యక్షుడు మైనార్టీ రైట్స్ ప్రొటెక్షన్ ఫ్రంట్, ఉమ్మడి వరంగల్

జలసవ్వడి..

● జాలువారుతున్న భీమునిపాద జలపాతం
● పర్యాటకుల సందడి..



సీతానగరం శివారు కొమ్ముల వంచ అడవిలో ప్రారంభమైన భీమునిపాద జలపాతం

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు భీమునిపాద జలపాతం జాలువారుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బుధవారం సాయంత్రం మొదటిసారి పాలనురగలా జారిపడుతూ కనువిందు చేసింది. దీంతో పర్యాటకులు తమ సెల్‌ఫోన్‌లో జలపాత దృశ్యాలను బంధిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. జలపాత సమీపంలో గూడూరు ఫారెస్టు రేంజ్ అధికారులు చెక్‌పోస్టు ఏర్పాటు చేసి అక్కడ మద్యపాన నిషేధం అమలు చేసినట్లు సిబ్బంది మధు తెలిపారు. కాగా, వర్షాకాలం ప్రారంభం నుంచి మండు వేసవి వరకు.. భీమునిపాద జలపాతం పర్యాటకులను కనువిందు చేస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాల నుంచే కాక ఖమ్మం, హైదరాబాద్ నుంచి కూడా ఈ జలపాతం వీక్షించడానికి పర్యాటకులు వస్తుంటారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

ఖానాపురం: చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని బుధరావుపేటలో జరిగింది. గ్రామానికి చెందిన గొల్లపల్లి జీవన్(26) కూలీ పని చేస్తూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంలో స్థిరపడడం లేదని తరచూ బాధపడుతూ అధికంగా మద్యం సేవించే వాడు. ఈ క్రమంలోనే రెండు రోజుల క్రితం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీనిపై మృతుడి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పిట్టల తిరుపతి తెలిపారు.



ఇసుక లారీ ఢీ : కార్మికుడి దుర్మరణం

ఆత్మకూరు: ఇసుక లారీ ఢీకొని ఓ కార్మికుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని కొత్తగట్టు శివారులో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం ఒడిశా రాష్ట్రానికి చెందిన విశ్వాస్(36) పరకాలలో సెంట్రింగ్ పనులు చేస్తున్నాడు. బుధవారం హనుమకొండకు వెళ్లి సాయంత్రం తిరిగి పరకాలకు బైక్‌పై వెళ్తున్నాడు.ఈ క్రమంలో కొత్తగట్టు సమీపంలో ఎదురుగా వస్తున్న ఇసుక లారీ ఢీకొంది. దీంతో తీవ్రగాయాలపాలైన విశ్వాస్‌ను వెంటనే 108లో ఎంజీఎం తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఎస్‌ఐ ప్రసాద్ ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

పసుపు.. కాడి రకానికి రికార్డు ధర

● క్వింటాల్‌కు రూ.9501



పసుపు రైతు రాంబాబు

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం విక్రయానికి వచ్చిన పసుపు.. కాడి రకానికి కొనుగోలుదారుడు రికార్డు స్థాయిలో ధర చెల్లించారు. ఖమ్మం జిల్లా ఎర్రిపాలెం మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన రైతు కే రాంబాబు 50 బస్తాల కాడి రకం పసుపును మార్కెట్‌కు తీసుకొచ్చాడు. వెంకటసాయి ట్రేడర్స్ క్వింటాల్‌కు రూ.9501 చెల్లించి కొనుగోలు చేశారు. కాగా, ఆరు సంవత్సరాల తర్వాత పసుపుకు అత్యధిక ధర పలిందని రైతు ఆనందం వ్యక్తం చేశాడు. కాగా, బుధవారం కాడి రకం పసుపు బస్తాలు 222 రాగా క్వింటాల్‌కు గరిష్టంగా రూ.9501, కనిష్టంగా రూ.8500, గోల రకం పసుపు బస్తాలు 98రాగా గరిష్ట ధర రూ.9101, కనిష్టంగా 8100 ధర నమోదైనట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

గోదావరికి పోటెత్తిన వరద

మహారాష్ట్ర నుంచి ప్రాణహిత ఇన్‌ఫ్లో 5.41 లక్షల క్యూసెక్కులు

● కాళేశ్వరం వద్ద 9.500 మీటర్లకు చేరిన నీటిమట్టం
● లక్ష్మీపంపుహౌస్‌లో మోటార్ల నిలిపివేత
● లక్ష్మీబ్యారేజీలో 57 గేట్లు ఎత్తివేత



కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన నుంచి తరలివెళ్తున్న వరద నీరు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద మహారాష్ట్ర నుంచి తరలివస్తున్న ప్రాణహిత నది వరదతో గోదావరి పోటెత్తింది. మహారాష్ట్రలో ఎగువన గడ్చిరోలి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో బుధవారం కాళేశ్వరం వద్ద గోదావరికి 9.500 మీటర్ల ఎత్తులో నీటిమట్టం పెరిగింది. వరదనీరు దిగువకు అంతర్రాష్ట్ర వంతెన నుంచి తరలి మేడిగడ్డలోని లక్ష్మీ బ్యారేజీకి వెళ్తుంది.

మోటార్ల నిలిపివేత

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి లక్ష్మీపంపుహౌస్‌లో వర్షాల కారణంగా మోటార్లను సీఎంఓ కార్యాలయం ఆదేశాలతో ఇంజనీరింగ్ అధికారులు నీటి పంపింగ్ నిలిపివేశారు. ఈనెల 3 నుంచి మంగళవారం రాత్రి వరకు నీటిని ఎత్తిపోశారు. ఇప్పటి వరకు 16 రోజుల్లో అన్నారం(సరస్వతీ) బ్యారేజీకి 9 టీఎంసీల నీటిని గ్రావిటీకాల్వ ద్వారా తరలించారు.

లక్ష్మీబ్యారేజీ 57 గేట్లు ఎత్తివేత

ఎగువ మహారాష్ట్ర నుంచి ప్రాణహిత నదికి భారీగా వరద వస్తుండడంతో ఇన్‌ఫ్లో 5.41 లక్షల క్యూసెక్కులు ప్రవహిస్తుంది. వరదనీరు మేడిగడ్డలోని లక్ష్మీ బ్యారేజీకి చేరుతుంది. వరద ఉధృతి పెరుగుతుండడంతో బ్యారేజీలో మొత్తం 85 గేట్లు ఉండగా 57 గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. అవుట్‌ఫ్లో 5.25 లక్షల క్యూసెక్కులు దిగువకు వెళ్తుంది.



కాళేశ్వరం వద్ద గోదావరికి పోటెత్తిన వరద



లక్ష్మీపంపుహౌస్‌లో నిలిపివేసిన మోటార్లు

బ్యారేజీ పూర్తి సామర్థ్యం 16.17 టీఎంసీలకు గాను ప్రస్తుతం 9.64 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సరస్వతీ గేట్లు ఎత్తే అవకాశం!

లక్ష్మీపంపుహౌస్‌లో ఎత్తిపోసిన నీరు అన్నారం(సరస్వతీ)బ్యారేజీకి చేరుతాయి. ఇటు తెలంగాణలో కూడా వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. బ్యారేజీలో మొత్తం 66 గేట్లు మూసి ఉంచారు. రాత్రి వరద ఉధృతి పెరిగితే బ్యారేజీలో కొన్ని గేట్లు ఎత్తి నీటిని కాళేశ్వరం మీదుగా తరలించడానికి అధికారులు ఇప్పటికే వాట్సాప్ గ్రూపుల్లో దిగువ ఉన్న గ్రామాల వారికి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అన్నారం చంద్రుపల్లి, నాగేపల్లి, మద్దులపల్లి, పలుగుల, పూస్కుపల్లి, కాళేశ్వరం మీదుగా వరద నీరు దిగువన మళ్లీ లక్ష్మీబ్యారేజీకి చేరనున్నాయి. ప్రస్తుతం బ్యారేజీలో 10.87 టీఎంసీలకు గాను ప్రస్తుతం 8.58 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సరస్వతీ బ్యారేజీకి ఎగువ మానేరు, ఇతర వాగుల, వంకల నుంచి 9.2 వేల క్యూసెక్కుల వరద తరలివస్తుంది. ఒక వేళ పెద్దపల్లి జిల్లా గుంజపడుగు వద్ద ఉన్న అన్నారం(సరస్వతీ పంపుహౌస్)లో మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోస్తే గేట్లు ఎత్తే అవసరం లేదని తెలిసింది. ఒకవేళ వరదపోటు పెరిగి గేట్లు ఎత్తినటయితే 16 రోజులుగా లక్ష్మీపంపుహౌస్ నుంచి 9 టీఎంసీల నీటిని ఎత్తిపోయగా..ఆ జలాలన్నీ మళ్లీ కాళేశ్వరం చేరనున్నాయని ఇంజనీరింగ్ అధికారులంతా తలలు పట్టుకున్నట్లు సమాచారం.



SERVICES

■ మీ బంగారం తాకట్టులో ఉందా వడ్డీ చెల్లించ లేకపోతున్నారా తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 7013501541 [H-788604]

CHANGE OF NAME

■ I, KESA JANARDHANA RAO (Old Name) Age: 59 yrs, R/o. H.No. 1-4-97/1A, Vill: Mahabubabad Mandal & Dist: Mahabubabad-506101, T.S, India, have changed my name as KESA JANARDHA RAO, S/o. Krishnamurthy (New Name). [W-785630]

LOANS

■ సిరి అసోసియేట్స్: హౌజ్, ఫ్లాట్, ఓపెన్ ప్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-785695]

WANTED

■ HNK, WGL లోకల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. 8 గం॥ 12 గం॥ డ్యూటీలు కలవు. జీతం: 12000-16000. సెల్: 9703637320 [WA-5370]

■ AR హోమ్‌కేర్ సర్వీసెస్ & మాంగళ్య మ్యారేజ్ బ్యూరోలో పనిచేయుటకు అర్జెంటుగా కంప్యూటర్ ఆపరేటర్ స్త్రీలు మాత్రమే కేవలం వరంగల్ లోకల్ వారికి. సంప్ర॥ 9640103719. [W-785699]

■ కాంట్రాక్టర్ వద్ద పెట్రోల్‌వంపు కన్‌స్ట్రక్షన్‌లో పని చేయుటకు అనుభవం కల్గిన సూపర్‌వైజర్ & లోకల్ (హన్మకొండ) డ్రైవర్లు కావలెను. సంప్ర: 9989606333, 9491474143. [W-785696]

■ లేపాక్షి హెల్త్‌కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 18K ఏజెంట్ కమీషన్ 6K, Ph: 9640400073 [H-189310]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

■ 3yr. ITR CA Auditing 12A 80G CSR Pan Card Nitiaayog BRL MSME Social Justice ISO సర్టిఫికెట్లు కల్గిన NGO నందు ఫండింగ్ & సేవ చేయుటక స్త్రీ/పు కావలెను. నెలకు 21K+, 81439 09459 [M-1221340]

■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 88854 86421. [M-1221457]

WANTED TEACHERS

■ Wanted Applications from Qualified and experienced teachers having excellent communication skills for all subjects (Pre Primary, Primary and Upper primary) IIT, Abacus, Computer, Instructor, A good calligrapher contact immediately. Shantiniketan High School, Near Durgeshwara Swamy Temple, Warangal. Cell: 7995850051. [WA-16631]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9010144453
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆర్టీసీ ఐటీఐలో ప్రవేశాలు..

● దరఖాస్తులకు ఈ నెల 31 చివరి గడువు
● విద్యార్థులు వినియోగించుకోవాలి
● వరంగల్ ఆర్టీసీ ఐటీఐ ప్రిన్సిపాల్ మోహన్‌రావు


హన్మకొండ: 90 సంవత్సరాలుగా రవాణా రంగంలో అత్యుత్తమ సేవలందిస్తూ విశేష ప్రజాదరణ చూరగొన్న సంస్థ ఆర్టీసీ. ఆర్టీసీ ఐటీఐలో ప్రవేశాలు పొందేందుకు ఈ నెల 31వ తేదీ చివరి గడువు అని ప్రిన్సిపాల్ వంగాల మోహన్ రావు తెలిపారు. నిరుద్యోగ యువతకు చక్కటి శిక్షణ, బంగారు భవిష్యత్తు అందించేందుకు ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వి.సి. సజ్జనార్ ఆర్టీసీ ఐటీఐని స్థాపించారన్నారు. డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, పెయింటర్, వెల్డర్ ట్రేడ్‌లతో టీఎస్ ఆర్టీసీ ఐటీఐని 2022-2023 విద్యా సంవత్సరం నుంచి వరంగల్‌లో నెలకొల్పినట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. 2023-2024 విద్యా సంవత్సరానికిగాను ఈ ఐటీఐలో రెండో విడత అడ్మిషన్ల కోసం ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. టీఎస్ ఆర్టీసీ ఐటీఐలో ప్రవేశాలు పొందాలనుకునే ఆసక్తి అభ్యర్థులు ముందు htt pr-://iti.teanfana.gov.in వెబ్ సైట్‌లో అప్లికంట్ క్లిక్ ఇయర్ టు అప్లై న్యూ రిజిస్ట్రేషన్‌పై క్లిక్ చేసి తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి పని చేస్తున్న ఫోన్ నంబర్, సొంత ఈ-మెయిల్ ఐడీ కలిగి ఉండాలి. తదుపరి లావాదేవీలన్నీ వీటి ద్వారా మాత్రమే జరుగుతాయని వివరించారు. విద్యార్థి సంతకం, పాస్ పోర్టు సైజ్ ఫొటోను జేపీజీలో స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలని, అదే విధంగా అవసరమైన ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలన్నారు. కాలేజీ ప్రిఫరెన్స్ వద్ద జిల్లా వరంగల్, టైప్: ప్రైవేట్ ఐటీఐ, టీఎస్ ఆర్టీసీ ఐటీఐ వరంగల్, చేరాలనుకునే ట్రేడ్‌ను నమోదు చేయాలని తెలిపారు. ఉచిత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం వరంగల్ ములుగు రోడ్డులోని ఆర్టీసీ ఐటీఐ కళాశాల/ ఆర్టీసీ జోనల్ శిక్షణ కళాశాలలోగాని సమీపంలోని ఆర్టీసీ డిపోల్లో సంప్రదించాలని కోరారు. అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వ స్కాలర్‌షిప్‌తో పాటు బస్‌పాస్ సౌకర్యం ఉందన్నారు. విద్యార్థులు కోరుకున్న ఆర్టీసీ డిపోలలో అప్రెంటీషిప్ సౌకర్యం కల్పిస్తామని, స్వయం ఉపాధి పొందడానికి అవసరమైన నైపుణ్యం వచ్చేలా ప్రతీ విద్యార్థిని ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దుతామన్నారు. ఉచిత కంప్యూటర్ శిక్షణ, కంప్యూటర్ ఆధారిత పరీక్షలపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు 0870-2982043, 9849425319, 8008136611 ఫోన్ నంబర్‌లలో, టీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

ఖాళీల వివరాలు:

ట్రేడ్ పేరు	కాల వ్యవధి	ఖాళీలు	అర్హత
డీజిల్ మెకానిక్	ఒక సంవత్సరం	48	పదో తరగతి
మోటార్ మెకానిక్	రెండు సంవత్సరాలు	24	పదో తరగతి
పెయింటర్	రెండు సంవత్సరాలు	20	ఎనిమిదో తరగతి
వెల్డర్	ఒక సంవత్సరం	40	ఎనిమిదో తరగతి

అదనపు కట్నం కోసం వేధింపులు..

● వివాహిత ఆత్మహత్య




రాజేశ్వరి (ఫైల్)

నెక్కొండ: అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు వేధించడంతో మనస్తాపం చెందిన ఓ వివాహిత.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన బుధవారం మండలంలోని మూడు తండా జీపీ పరిధి పెద్దమంగళి తండాలో జరిగింది. ఎస్సై జానీపాషా కథనం ప్రకారం తండాకు చెందిన భూక్య జ్యోతి, వెంకన్న దంపతులు కూతురు రాజేశ్వరి (21)కి ములుగు జిల్లా దేవగిరిపట్నానికి చెందిన వాంకుడోతు మోతీ, రుక్లా దంపతుల కుమారుడు రమేశ్‌తో ఏడాదిన్నర క్రితం జరిగింది. రమేశ్ ప్రైవేట్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కొంతకాలంగా ఆయన పని వెళ్లకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో బంగారం, అదనపు కట్నం కోసం భార్యను వేధించసాగాడు. ఫలితంగా రాజేశ్వరి మూడు నెలల క్రితం పుట్టింటికి వచ్చింది. ఈ విషయమై ఇటీవల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు.. దంపతులకు కౌన్సెలింగ్ నిర్వహించినా రమేశ్‌లో మార్పు రాకపోవడంతోపాటు భర్త, అత్తమామల వేధింపులు ఎక్కువ అయ్యాయి. దీంతో వేధింపులు భరించలేక సూసైడ్ నోట్ రాసిన అనంతరం మంగళవారం తెల్లవారుజామున రాజేశ్వరి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు వెంటనే ఆమెను హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మానేరు, పాలెం ప్రాజెక్టులకు జలకళ



నిండుకుండలా పాలెం ప్రాజెక్టు




వెంకటాపురం(కె): ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసిన అధికారులు

వెంకటాపురం(కె): మండలపరిధిలోని మల్లాపురం సమీపంలో నిర్మించిన పాలెం వాగు ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్‌లో కురుస్తున్న వర్షాలకు భారీగా వరద నీరు పాలెం ప్రాజెక్టులోకి చేరుకుంటుంది. ప్రాజెక్టు సామర్థ్యానికి మించి వరద నీరు చేరడంతో ప్రాజెక్టుకు సంబంధించిన నాలుగు గేట్లను ఎత్తి దిగువకు నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు.

ప్రాజెక్టు ప్రధానకాల్వకు గండి

నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పాలెం ప్రాజెక్టు ప్రధానకాల్వకు ఒంటిమామిడి గ్రామ సమీపంలో బుధవారం గండి పడింది. భారీ వర్షాలకు ప్రాజెక్టు ప్రధాన కాల్వ కట్ట బలహీన పడిందని అధికారులు తెలిపారు. ప్రధాన కాల్వకు గండి పడి వరద నీరు పొలాల్లోకి చేరినట్లు తెలిపారు.

మల్హర్: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా తాడిచర్ల, ఖమ్మంపల్లి-అడవిసో మన్‌పల్లి సరిహద్దు మానేరు, మల్లారం ఆరెవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో జలకళను సంతరించుకుంది. మల్హర్ మండలంతో పాటు భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలతో మానేరు, ఆరెవాగుకు ఇరువైపులా నీరు ప్రవహిస్తుండడంతో నిండు కుండలా దర్శనమిస్తున్నాయి. చెరువులకు, వాగుల్లో భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో కర్షకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మల్హర్ : ఉధృతంగా ప్రవహిస్తున్న అడవి సోమన్‌పల్లి మానేరు

ముగ్గురిపై హత్యాయత్నం కేసు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఒకరిని హత్య చేసేందుకు యత్నించిన చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ సతీశ్ బుధవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన పొన్నం సంపత్ సోమవారం రాత్రి పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వచ్చారు. ఇంతలో మల్లేశ్, కిరణ్, దిలీప్ అనే ముగ్గురు వ్యక్తులు సంపత్ వద్దకు వచ్చారు. దిలీప్ బైక్‌తో సంపత్‌ను ఢీకొనగా అతడు కిందపడ్డాడు. అనంతరం అదేబైక్‌పై నుంచి మల్లేశ్, కిరణ్ కత్తులతో దిగుతుండగా సంపత్ గమనించి వెంటనే అక్కడి నుంచి రాహుల్ నగర్ కాలనీలోకి వెళ్లి వద్ది నాగేశ్ ఇంట్లోకి చేరుకున్నాడు. అనంతరం మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా బాధితుడి ఫిర్యాదు మేరకు మల్లేశ్, కిరణ్, దిలీప్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని టౌన్ సీఐ తెలిపారు.